సాక్షి
వికారాబాద్
శనివారం ၊ 15 ၊ మార్చి ၊ 2025




పల్లె గొంతెండుతోంది!

ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



ఘనంగా ఓరి పండుగ

తండాల్లో ఓరి పండుగను శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. కాముడి దహనం మరునటి రోజు ఈ వేడుక చేసుకుంటారు. 9లో▸





అనంతగిరి: హోలీ ఆడుతున్న చిన్నారి



అనంతగిరి: వికారాబాద్‌లో హోలీ సంబురాలు



పరిగి: హోలీ సంబరాల్లో నాయకులు, యువకులు

హోలీ.. జాలీ

హోలీ పండుగను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఉదయమే చిన్నారులు వీధుల్లోకి వచ్చి రంగులు చల్లుకున్నారు. యువతీయువకులు, మహిళలు, పెద్దలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా సహజ సిద్ధ రంగులనే ఎక్కువగా ఉపయోగించారు. మధ్యాహ్నం వరకు రంగుల దుకాణాలు జనంతో సందడిగా కనిపించాయి. వేడుకల ముగింపు సందర్భంగా ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

– అనంతగిరి



తాండూరు: హోలీ వేడుకల్లో యువత



వికారాబాద్‌లోని ఓ కాలనీలో చిన్నారుల సందడి



తాండూరు: రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహిపాల్‌రెడ్డి

కుల్కచర్ల: మండలంలోని పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు పాండుశర్మ గ్రామస్తులతో కలసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుక్కపై ఎలుగుబంటి దాడి

బెల్కటూర్ శివారులో ఘటన

తాండూరు రూరల్: మండలంలోని బెల్కటూర్ శివారులో ఎలుగుబంటి సంచారం కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామ శివారులోని ఓ పాలిషింగ్ యూనిట్ పరిసరాల్లో శుక్రవారం తెల్లవారుజామున ఎలుగుబంటి కనిపించింది. దాన్ని చూసిన కుక్కలు మొరగడంతో ఎలుగుబంటి దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కుక్క మూతి భాగానికి తీవ్ర గాయమైంది. ఈ విషయమై తాండూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీదేవి సరస్వతిని వివరణ కోరగా.. గ్రామ శివారులో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారని తెలిపింది. తమ సిబ్బంది జంతువు కాలి ముద్రలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

నేటి నుంచి ధ్యానోత్సవం

ఇబ్రహీంపట్నం: హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీ రామచంద్ర మిషన్ సంయుక్తంగా శని, ఆది, సోమవారాల్లో ఇబ్రహీంపట్నంలోని ఓసీ కమ్యూనిటీ హాల్‌లో ధ్యానోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15 సంవత్సరాలు దాటిన వారంతా ఈ ధ్యానోత్సవానికి హాజరు కావొచ్చని తెలిపారు. ధ్యానంతో కలిగే భౌతిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను ఈ కార్యక్రమంలో వివరించనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ ప్లీడర్‌గా గీతావనజాక్షి



మొయినాబాద్: పెద్ద మంగళారం మాజీ సర్పంచ్, న్యాయవాది గీతావనజాక్షి అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి కలెక్టర్, మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారానికి చెందిన గీతావనజాక్షి న్యాయవాదిగా పనిచేస్తున్నారు. 2013 నుంచి 2018 వరకు ఆమె గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. మహిళలకోసం లీగల్ క్లినిక్‌ను సైతం నడుపుతున్నారు. చేవెళ్ల జూనియర్ సివిల్ కోర్టు, ఇతర కోర్టులకు అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా ఆమెను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులైన సందర్భంగా పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

మోసం.. శాపం



ఇటీవల పెద్దేముల్ మండలంలో స్వాధీనం చేసుకున్న నకిలీ విత్తనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

తరచూ మోసాల బారిన వినియోగదారులు

- మచ్చుకైనా కనిపించని నాణ్యత
- పత్తాలేని వినియోగదారుల ఫోరం
- జిల్లాకు కేటాయించని తూనికల కొలతల విభాగం
- ఆర్థికంగా నష్టపోతున్న జనం

వికారాబాద్/అనంతగిరి/తాండూరు /బంట్వారం: నాణ్యమైన వస్తు సేవలు పొందడం అందరి హక్కు. కొన్ని సంస్థలు, వ్యాపారులు లాభార్జనే ధ్యేయంగా మన్నిక రాని వస్తువులు, పరికరాలు తయారు చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తుంటారు. అలాంటి వాటిని కొనుగోలు చేసిన ప్రజలు ఆర్థికంగా నష్టపోతుంటారు. ఇలాంటి మోసాలకు చెక్ పెట్టేందుకు భారత ప్రభుత్వం 1986లో వినియోగదారుల హక్కుల రక్షణ చట్టాన్ని అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వ్యాపారుల చేతుల్లో వినియోగదారులు మోసపోతూనే ఉన్నారు. ప్రతి ఏటా మార్చి 15న అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని జరుపుకొంటాము. వినియోగదారులు ఎలాంటి మోసాలకు, అన్యాయానికి గురి కారాదన్నదే దీని లక్ష్యం. కానీ నేటి ప్రపంచంలో మనిషి నిత్యం ఏదో ఒక రూపంలో అన్యాయానికి గురవడం సర్వసాధారణమైపోయింది. ఉదయం పాలు కొనుగోలు మొదలు అన్నింటా మోసానికి గురవుతున్నారు. పెట్రోల్ బంకులు, మార్కెట్లు, దుకాణాలు ఇలా ప్రతి చోటా తూకాల్లో వ్యత్యాసం, నాణ్యతలో మోసం నిత్యకృత్యమైంది. వికారాబాద్ ప్రతేక జిల్లాగా ఏర్పాటై ఎనిమిదేళ్లు గడిచినా ఇప్పటి వరకు తూనికలు, కొలతల విభాగం లేకపోవడం గమనార్హం. వినియోగదారుల దినోత్సవం రోజు తప్ప మిగతా రోజుల్లో వినియోగదారుల హక్కులు ఎవరికీ పట్టవు. ఆ ఒక్క రోజు అధికారులు హడావుడి చేస్తారు. విద్యుత్ శాఖలో మాత్రం అప్పుడప్పుడు వినియోగదారుల ఫోరం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించి మమా అనిపిస్తున్నారు.

- రెండు రోజుల క్రితం వికారాబాద్ పట్టణంలోని ఓ బార్‌లో సీలింగ్ ఫ్యాన్ ఊడి పడింది. అదృష్టవశాత్తు ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. సదరు యాజమానికి ఇదేం నిర్వహణ అడగ్గా ఏమీ పట్టనట్లు వ్యవహరించారని పలువురు వినియోగదారులు తెలిపారు.
- ఇటీవల వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లిలోని ఓ బంక్‌లో వినియోగదారుడు తన బైక్‌కు పెట్రోల్ పోసుకున్నాడు. తక్కువగా రావడంతో సదరు వ్యక్తి బంక్ నిర్వాహకులను ప్రశ్నించాడు. వారు ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ విషమై బాధితుడు సివిల్ సప్‌లై అధికారులకు ఫిర్యాదు చేశాడు. మరుసటి రోజు పెట్రోల్ బంక్‌ను సందర్శించిన అధికారులు అంతా బాగుందని వెనుదిరిగారు.
- గత ఆదివారం ఓ వినియోగదారుడు వికారాబాద్ బస్టాండ్ సమీపంలోని ఓ దుకాణంలో అరకిలో మటన్ కొనుగోలు చేశాడు. అనుమానం వచ్చి మరో చోట తూకం వేయించడా 100గ్రాములు తక్కువగా వచ్చింది. దీంతో ఖంగుతిన్నాడు. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఊరకుండిపోయాడు.
- పంట ఉత్పత్తుల కొనుగోలులో మోసాలు నిత్యకృత్యం.. రైతుల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నా అడిగే నాథులు లేరు. తరుగు, నాణ్యత లేదని క్వింటాలుకు రెండు మూడు కిలోలు అదనంగా తీసుకుంటున్నారు. తూకాల్లో మోసం సరేసరి. వ్యవసాయ మార్కెట్ అధికారులు ఇవేవీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

అవగాహన లేకపోవడంతోనే..

వినియోగదారుల హక్కుల చట్టాలపై ప్రజలకు అవగాహన లేకపోవడంతోనే మోసాలకు గురైనా న్యాయం పొందలేకపోతున్నారు. ఈ చట్టాలపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మోసపోయిన వారి ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియడం లేదు. తూనికలు కొలతల విభాగం అధికారులు దుకాణాలను తనిఖీ చేయకపోవడంతో వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఫిర్యాదులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు స్పందించి దాడులు చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలు, అల్లం పేస్ట్, కారం, టీ పొడిని సీజ్ చేశారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అమలు

- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

బొంరాస్‌పేట: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నేటి నుంచి(శనివారం) ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ అన్ని పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాలల నిర్వహణ సమయంలో మార్పులు జరిగాయి.

'పది'కి మినహాయింపు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక తరగతులను నిర్వహించాలని విద్యాశాఖ సూచించింది. అన్ని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు జరగనున్నాయి.

21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు

జిల్లాలో ఈ ఏడాది 12,901 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10,074మంది, ప్రైవేట్ స్కూళ్లలో 2,827 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఐదు నెలలుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. అప్పటికే అధికారులు పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు.

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు

ఉన్నత	176
కేజీబీవీలు	18
మోడల్	09
యూపీఎస్‌లు	114
ప్రాథమిక	770
మొత్తం విద్యార్థుల సంఖ్య	1,22,556

ఒంటిపూట బడుల సమయపాలన

- ఉదయం 8గంటలకు పాఠశాలలు ప్రారంభం
- ఉదయం 8.05 నుంచి 8.15 వరకు ప్రార్థన
- 8.15 – 8.55 వరకు ఒకటో పిరియడ్
- 8.55 – 9.35 వరకు రెండో పిరియడ్
- 9.35 – 10.15 వరకు మూడో పిరియడ్
- 10.15 – 10.30 వరకు స్వల్ప విరామం
- 10.30 – 11.10 వరకు నాల్గో పిరియడ్
- 11.10 – 11.50 వరకు ఐదో పిరియడ్
- 11.50 – 12.30 వరకు ఆరో పిరియడ్

24 నుంచి వేసవి సెలవులు

విద్యా సంవత్సరం ప్రకారం వచ్చే నెల 23వ తేదీ వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి. 24 నుంచి వేసవి సెలవులు ఉంటాయి.

జాగ్రత్తగా ఉండాలి



ఎండలు ముదురుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాలల్లో విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నాం. శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభవుతాయి. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి.

– రేణుకాదేవి, డీఈఓ

భానుడి భగభగలు

- జిల్లాలో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో ఆరెంజ్ అలర్ట్
- వడగాల్పులతో జనం బెంబేలు



బషీరాబాద్: భానుడు భగ్గుమంటున్నాడు. శుక్రవారం జిల్లాలో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మరో 17 మండలాల్లో ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది. కొడంగల్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 28.7 డిగ్రీలుగా నమోదైంది. ఉదయం 10 గంటలకే వడగాలులు వీస్తుండటంతో జనం హడలిపోతున్నారు. ఎండల తీవ్రత కారణంగా రోడ్లమీదకు రావాలంటేనే జంకుతున్నారు. మరో వైపు బోరుబావులు, చెరువుల్లో భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి.

ఉష్ణోగ్రతలు డిగ్రీల్లో..

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
మర్పల్లి	40.3	32.7
మోమిన్‌పేట	40.2	30.9
ధారూరు	40.0	32.4
పూడూరు	40.0	32.4
బంట్వారం	39.2	31.6
దౌల్తాబాద్	39.1	32.1
నవాబుపేట	39.1	29.0
వికారాబాద్	39.0	27.7
బషీరాబాద్	38.8	29.5
పరిగి	38.5	30.7
యాలాల	38.5	31.1
చౌడాపూర్	38.4	30.9
తాండూరు	38.2	30.8
కుల్కచర్ల	38.1	30.6
దోమ	37.9	28.4
పెద్దేముల్	37.6	31.1
బొంరాస్‌పేట	37.3	27.8
దుద్యాల్	36.4	29.0
కొడంగల్	36.1	28.7

కుల్ఫీ ఐస్‌క్రీమ్, బర్ఫీ స్వీట్‌లలో గంజాయి

స్పెషల్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి..



స్వాధీనం చేసుకున్న కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు (ఇన్‌సెట్‌లో) సిల్వర్ కోటెడ్ బాల్స్

సాక్షి, సిటీబ్యూరో/అబిడ్స్: హోలీ సంబరాలను సొమ్ము చేసుకొనేందు కు గంజాయి విక్రేతల ముఠా కొత్త పన్నాగం పన్నింది. హోలీ వేడుకల్లో భాగంగా శుక్రవారం లోయర్ ధూల్‌పేట్‌లో కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు, బర్ఫీ స్వీట్లకు సిల్వర్ కోటెడ్ బాల్స్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. 100 కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లు, 72 బర్ఫీ స్వీట్లు, సిల్వర్ కోటెడ్ బాల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణ సింగ్ అనే వ్యక్తి కుల్ఫీ ఐస్‌క్రీమ్‌లో గంజాయిని కలిపి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు. గంజాయితో తయారైన వీటిని స్వాధీనం చేసుకుని, సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రూపు-3లో మెరిసిన గిరిపుత్రుడు

రాష్ట్ర స్థాయిలో 63వ ర్యాంకు



దేవేందర్‌నాయక్

మహేశ్వరం: ఉద్యోగం చేస్తూనే ఉన్నత స్థాయికి వెళ్లాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివాడా యువకుడు. పేద కుటుంబంలో పుట్టి గ్రూప్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి సత్తా చాటాడు. మహేశ్వరం మండలం పెద్దమ్మ తండా గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న నల్లచెర్వు తండాకు చెందిన కాట్రావత్ దేవేందర్ నాయక్ శుక్రవారం వెల్లడించిన గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 63వ ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో శంషాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

సంతోషంలో తల్లిదండ్రులు

ఇటీవల విడుదలైన గ్రూప్-2, గ్రూప్-1, గ్రూప్-3 ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబర్చాడు. అంతకుముందు గ్రూప్-2 ఫలితాల్లో జోనల్ ఎస్టీ కేటగిరిలో 2వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 171వ ర్యాంకు సాధించాడు. గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో 433 మార్కులు సాధించారు. గ్రూప్-3 పరీక్ష ఫలితాల్లో ఎస్టీ కేటగిరిలో 2వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 63వ ర్యాంకు సాధించి మెరిశాడు. దీంతో ఏదైనా ఉన్నత ఉద్యోగం తమ కుమారుడికి వస్తుందని దేవేందర్‌నాయక్ తల్లిదండ్రులు లక్ష్మి, రాములు నాయక్ సంతోష పడుతున్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీ, వ్యక్తి మృతి

పరిగి: గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి రంగంపల్లి కాటన్‌మిల్లు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి నుంచి రంగంపల్లి వైపు హైదారాబాద్‌- బీజాపూర్ జాతీయ రహదారిపై సుమారు 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి, గురువారం రాత్రి 10 గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలై దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతున్ని గుర్తించిన వారు 8712670041 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అనంతగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ పోకడలను మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్‌లో ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని ఉద్దేశపూర్వకంగా సభ నుంచి సస్పెండ్ చేశారని, ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పని చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సుభాన్ రెడ్డి, అనంత్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి మేస్త్రీ మృతి

కొడంగల్ రూరల్: తాగిన మైకంలో ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం రుద్రారం పరిధిలోని పాటిమీదిపల్లి భీరం చెరువులో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బషీరాబాద్ మండలం బాదులాపూర్‌తండాకు చెందిన రాథోడ్ మోహన్(46) మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం మద్యం తాగి బీరం చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత సరిగ్గా రాకపోవడంతో చెరువులో మునిగి మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడి భార్య సాలీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

ఆదివాసీ సంఘీభావ వేదిక ఏర్పాటు

ముషీరాబాద్: ఉమ్మడి హైదరాబాద్ ఆదివాసీ సంఘీభావ వేదికను ఏర్పాటు చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక కన్వీనర్లుగా దళిత లిబరేషన్ ఫ్రంట్ నుంచి ఇందిర, ప్రజా కళామండలి నుంచి రాణి, చైతన్య మహిళా సంఘం నుంచి జయ, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నుంచి రవి, ఏఐఎఫ్‌టీయూ నుంచి మల్లేష్, పీడీఎస్‌యూ మహేష్, అమరుల బంధుమిత్రుల సంఘం సత్యను ఎంపిక చేశారు. అలాగే పౌర హక్కుల సంఘం హైదరాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ వేదిక కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని లక్ష్మణ్ తెలిపారు. ఆదివాసీలపై మారణహోమాన్ని నిలిపి వేయాలని, సహజ వనరుల దోపిడీని అరికట్టాలని, పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

రూ.5లక్షల విలువైన విద్యుత్ వైర్లు చోరీ

యాచారం: ఐదు లక్షల రూపాయల విలువ జేసే విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాలివీ.. మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇంజాపూర్ గ్రామానికి చెందిన నోముల కృష్ణాగౌడ్ బాలాజీ వెంచర్‌ను ఏర్పాటు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం వెంచర్‌లోని విద్యుత్ స్తంభాలకు ఉన్న రూ.5 లక్షల విలువ జేసే వైర్లను కత్తిరించి ఎత్తుకెళ్లారు. సిబ్బంది సమాచారం మేరకు యజమాని యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విద్యుత్ వైర్లతో పాటు విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పల్లె గొంతెండుతోంది!

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదు. మొన్న హస్నాబాద్.. ఇవాళ ఆలేడ్ గ్రామాలలో మిషన్ భగీరథ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగు నీటికి అరిగోస పడుతున్నారు.

- ఆరు రోజులుగా మిషన్ భగీరథ బంద్
- తీవ్ర అవస్థలు పడుతున్న ఆలేడ్ గ్రామస్తులు
- స్పందించని అధికార యంత్రాంగం

దుద్యాల్: మండుటెండలు ముదురుతున్న తరుణంలో ప్రజలను నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచి ఆరు రోజులు గడుస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో కనీస అవసరాలకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని మండలంలోని ఆలేడ్ గ్రామస్తులు లబోదిబోమంటున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ తాగునీటి సరఫరా ఆరు రోజులుగా బంద్ కావడంతో అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక గ్రామ సమీపంలోని వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకొని కాలం వెళ్లదీస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ అదే మాటే

మిషన్ భగీరథ నీటి సరఫరా ఈ నెల 9 నుంచి బంద్ కావడంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సైతం చేయడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. కొందరు గ్రామానికి సరఫరా అయ్యే బోరును తమ వ్యవసాయ పొలాలకు వాడుతున్నారనే ఆరోపణ కూడా వ్యక్తం అవుతోంది. గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేసే సంబంధిత వ్యక్తిని ఫోన్ ద్వారా సంప్రదించగా... పైపు లైన్ పగిలిపోయిందని, మరమ్మతులు చేస్తున్నారని సెలవిచ్చారు. గ్రామస్తులకు సైతం ఇదే సమాధాన్ని ఆరు రోజులుగా చెబుతుండడం గమనార్హం. మరోవైపు గ్రామంలోని పాఠశాలలో వేసిన బోరు నుంచి వచ్చే కొద్దిపాటి నీటితో కొందరు ఉపశమనం పొందుతున్నారు.

ధర్నా చేపడతాం

ఉన్నతాధికారులు స్పందించి వెంటనే గ్రామంలో తాగునీటి సరఫరా చేయాలని కోరుతున్నారు. లేకుంటే అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఊరిలో తాగునీటి సరఫరా ఇబ్బందిగా మారినప్పుడు గ్రామ పంచాయతీ ట్యాంకర్ సహాయంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల హస్నాబాద్‌లో తాగునీటి కోసం స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికార యంత్రాంగం స్పందించి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నారు. అదే మాదిరి తమ గ్రామంలో చర్యలు తీసుకోవాలని ఆలేడ్ గ్రామస్తులు 'కన్నీటి'తో విజ్ఞప్తి చేస్తున్నారు.



పాఠశాల ట్యాంకు వద్ద నీటి కోసం గ్రామస్తుల పడిగాపులు



నల్లాలో నీరు రావడం లేదని చూపుతున్న ఓ మహిళ

పట్టించుకోవడం లేదు



గ్రామంలో ఆరు రోజులుగా తాగునీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతుంటే ఒక్క అధికారి సైతం పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీ ట్యాంకర్ ఉన్నా నిరుపయోగంగానే ఉంది. ఆపత్కాలంలో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలి. ఆ దిశగా అధికార యంత్రాంగంలో కదలిక కరువైంది.

– మహేశ్, గ్రామస్తుడు, ఆలేడ్

బోర్లను ఆశ్రయిస్తున్నాం



గ్రామ శివారులోని వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. అధికారులు మా గ్రామం వైపు చూడడం లేదు. వేసవి కాలం కావడంతో నీటి అవసరాలు పెరిగాయి. ప్రస్తుతం భగీరథ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వెంటనే మరమ్మతులు చేపట్టి దాహార్తిని తీర్చండి.

– మొగులమ్మ, గ్రామస్తురాలు, ఆలేడ్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం: చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు స్కూటర్‌పై నుంచి కింద పడి గాయాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఇబ్రహీంపట్నంకు చెందిన మత్స్య కార్మికుడైన చెరుకు కుమార్(60) పెద్ద చెరువు వద్ద నుంచి స్కూటర్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డటంతో తలకు గాయమైనట్లు తెలిపారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు. మత్స్యకారుడైన కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిహెచ్.శంకర్ శుక్రవారం ప్రభుత్వాన్ని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పహాడీషరీఫ్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం లభ్యమయింది. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామ పరిధి వీబీపీ కాలనీ బహిరంగ ప్రదేశంలో ఓ వ్యక్తి పడున్నాడన్న సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. కానీ అతను అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 52–55 ఏళ్ల మధ్య ఉంటుందని, సంబంధికులెవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్ లేదా.. 8712662366 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

శివారు ప్రాంతాలు.. చోరీలకు నిలయాలు

- రెచ్చిపోతున్న దోపిడీ దొంగలు
- తరచూ ఇళ్లలో చోరీలు
- భయాందోళనలో ప్రజలు

అబ్దుల్లాపూర్‌మెట్: హైదరాబాద్ నగర శివారులో దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని అందిన కాడికి దోచుకొని పరారవుతున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ఈ తరహా ఘటనలు కలవరం పెడుతున్నాయి. ప్రతి నిత్యం గ్రామాల్లో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నా వారి కళ్లను కప్పి కేటుగాళ్లు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ఫిబ్రవరి నెలలో మండలంలోని రెండు దేవాలయాల్లో దొంగతనానికి పాల్పడగా, ఈ నెలలో ఇప్పటి వరకూ పలుచోట్ల ఇళ్లలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించుకుపోయి సవాల్ విసురుతున్నారు.



కవాడిపల్లిలో చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు (ఫైల్)

ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు

- గత నెల 18వ తేదీన పిగ్లీపూర్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయంలో చోరీ జరిగింది. దొంగలు ఆలయంలోని విగ్రహానికి అమర్చిన 15 కిలోల వెండి తొడుగును అపహరించుకుపోయారు. వాహన తనిఖీల్లో ఈ నెల 4వ తేదీన ఆలయంలో దోపిడీకి పాల్పడిన ఇద్దరు దుండగులను పోలీసులు పట్టుకుని, వారి నుంచి 20 కిలోల వెండి బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు.
- అనాజ్‌పూర్ గ్రామంలో గత నెల 27వ తేదీన శివాలయంలో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయంలోని రెండు హుండీలతో పాటు ఎల్‌ఈడీ లైట్లను అపహరించుకుపోయారు.
- మండల పరిధిలోని కవాడిపల్లి గ్రామంలోని ఉదయ్‌గార్డెన్స్‌లో ఈ నెల 10వ తేదీన ఓ ఇంటి తాళాలు పగులగొట్టి 4 తులాల బంగారు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.లక్ష మేర నగదును దోచుకెళ్లారు.
- బలిజగూడ గ్రామంలోనూ ఇదే తరహాలో ఓ ఇంట్లో ఈ నెల 10వ తేదీన దొంగతనం జరగగా.. 3 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలు, రూ.38 వేల నగదు అపహరించుకుపోయారు.
- తాజాగా గురువారం రాత్రి అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సాయినగర్ కాలనీలో నివాసముండే కొత్త రమేశ్ ఇంట్లోకి చొరబడిన దుండగులు 2.5 గ్రాముల బంగారు చెవి కమ్మలు, 20 తులాల వెండి పట్టీలు, 10 వేలు నగదును తస్కరించారు.

హత్య చేసిన నిందితుడికి రిమాండ్

- గతంలోనూ పలు కేసులో ఉన్నట్లు నిర్ధారణ
- రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

షాబాద్: మద్యం దుకాణంలో దొంగతనం చేస్తూ, అడ్డొచ్చిన ఓ యువకుడిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి ఓ ఆగంతకుడు షాబాద్ మండల కేంద్రంలోని దుర్గా వైన్స్‌లో దూరి పర్మిట్ రూమ్‌లో పడుకున్న వ్యక్తిని హత్య చేసిన సంగతి విదితమే. శుక్రవారం రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పుడుగుర్తి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి నరేందర్ జల్సాలకు అలవాటు పడి చోరీలను ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 12న అర్ధరాత్రి అతడు దుర్గా వైన్స్‌లో చోరీకి యత్నించాడు. వెనుక వైపు గోడకు సుత్తెతో రంధ్రం చేస్తుండగా.. శబ్దం విని అక్కడే పనిచేసే భిక్షపతి(35) పర్మిట్ రూమ్ నుంచి బయటకు వచ్చి గట్టిగా అరిచాడు. దీంతో నరేందర్ పారతో భిక్షపతి తలపై కొట్టాడు. విలవిలలాడుతూ అక్కడే అతడు మృతి చెందాడు. ఆ తర్వాత వైన్స్‌లో దూరి సుమారు రూ.40వేల నగదు, కొన్ని మద్యం బాటిళ్లను తీసుకొని పరారయ్యాడు.



వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

సీసీ కెమెరా ఆధారంగా..

కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరా ఆధారంగా నిందితుడి నరేందర్‌గా గుర్తించారు. అతడిని శుక్రవారం ఉదయం సీతారాంపూర్ గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి బ్యాంక్ అకౌంట్‌ను నిలుపుదల చేసి కొంత సొత్తును రికవరీ చేశారు. కాగా నరేందర్‌పై గతేడాది బహదూర్‌పురా, అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాలుగు చోరీల కేసులో నేరస్తుడిగా ఉన్నట్లు పోలీసులు తేల్చారు. ఈ నెల 3న నాగర్‌గూడ వైన్స్‌లో దొంగతనానికి పాల్పడ్డాడని నిర్ధారించారు. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ హత్య కేసును 24 గంటల్లోగా ఛేదించినందుకు రాజేంద్రగనర్ జోన్, చేవెళ్ల ఏసీపీలు ప్రశాంత్, కిషన్, ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ కె.శశాంక్‌రెడ్డి, షాబాద్ సీఐ కాంతారెడ్డి బృందాలను డీసీపీ అభినందించారు.

వరకట్న వేధింపులకు యువతి బలి

అత్తాపూర్: వరకట్న వేధింపులతో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటకలోని బీదర్‌కు చెందిన స్వప్న(27)కు అత్తాపూర్ పాండురంగ నగర్‌కు చెందిన అమరేష్‌కు రెండున్నర సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇటీవల కొద్దిరోజులుగా అమరేష్ అదనంగా కట్నం కావాలని భార్యను వేధిస్తున్నాడు. పెళ్లి సమయంలో పెట్టిన బంగారాన్ని తన అవసరాల నిమిత్తం తాకట్టు పెట్టడంతో పాటు అదనంగా డబ్బు కావాలని డిమాండ్ చేస్తూ వేధించసాగాడు. ప్రతిసారి ఇంటి నుంచి డబ్బులు తేలేక..వేధింపులు తట్టుకోలేక శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

కేసు నమోదు చేసిన పోలీసులు

మాడ్గుల: బెల్ట్‌షాప్‌లో విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు మండల కేంద్రంలోని అంబాల యాదయ్యకు చెందిన మణికంఠ కిరాణం, ఈర్ల శ్రీనివాస్‌కు చెందిన జై హనుమాన్ కిరాణం, నాగిళ్ల గ్రామంలోని అగిర్ చంద్రశేఖర్ కిరాణం దుకాణల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రూ.50వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.6 వేల విలువ..

యాచారం: అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలివీ.. మండల పరిధిలోని తమ్మలోనిగూడలో రాములు అనే వ్యక్తి కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు శుక్రవారం యాచారం పోలీసులు వెళ్లి దుకాణంలో తనిఖీ చేయగా రూ.6 వేల విలువ జేసే లభ్యమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.



మాడ్గుల: బెల్ట్ షాప్‌లో స్వాధీనం చేసుకున్న మద్యం

ఆలయంలో యాసిడ్ దాడి కలకలం

సైదాబాద్: ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై గుర్తు తెలియని యువకుడు యాసిడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి...ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి లక్ష్మీనగర్ కాలనీలో నివసించే నర్సింగ్‌రావు (52) పెద్దతోటలోని శ్రీభూలక్ష్మీ మాత ఆలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఆలయంలో ఉండగా అక్కడికి వచ్చిన గుర్తు తెలియని యువకుడు మొదట ఆలయంలో పూజలు, హోమాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు. కొన్ని పూజలకు ఇంత ధరలు ఎందుకు పెట్టారని వాగ్వాదానికి దిగాడని తెలుస్తోంది. అంతలోనే ఆ యువకుడు తనతో తెచ్చుకున్న యాసిడ్ వంటి కెమికల్‌తో నర్సింగ్‌రావుపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో నర్సింగ్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని మలక్‌పేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆలయం, పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వినియోగదారుడా..బీ అలర్ట్!

- ఆర్థిక భారం లేకుండా న్యాయం పొందే అవకాశం
- ఈ చట్టం గురించి తెలుసుకుంటే ఎంతో మేలు

సిటీ కోర్టులు: మార్కెట్‌లో కొనుగోలు చేసిన వస్తువు నాణ్యత, సేవల పరంగా వినియోగదారుడికి ఏ విధమైన మోసం జరిగినా మేమున్నామంటూ వినియోగదారుల ఫోరం అండగా నిలుస్తోంది. కొనుగోలు చేసే వస్తువులపై గరిష్ట ధర (ఎమ్మార్పీ), ఎక్స్‌పైరీ తేదీ, కంపెనీ చిరునామా, ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబరు తదితర వివరాలు ఉత్పత్తులపై ముద్రించాల్సి ఉంటుంది. పేర్కొన్న వివరాలకు, వస్తువు, సేవల్లో పొందిన వాస్తవానికి తేడాలున్నపుడు వినియోగదారుడు ఫోరాన్ని ఆశ్రయించవచ్చు. పైసా ఖర్చు లేకుండా కమిషన్‌లో కేసు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తుంది. ఆర్థిక స్థోమత లేనివారు సొంతంగా తమ కేసును తామే వినిపించుకునే వెసులుబాటూ ఉంది. ఆన్‌లైన్‌లోనూ కేసు నమోదు చేసుకోవచ్చు. వర్చువల్‌గా కేసుల వాదనలు వినిపించుకోవచ్చు. రూ.50 లక్షల విలువైన వస్తువు, సేవల కోసం జిల్లా కమిషన్‌లో ఫిర్యాదు చేయాలి. రూ.2 కోట్ల వరకు రాష్ట్ర కమిషన్‌లో, అంతకుమించితే జాతీయ కమిషన్‌లో ఫిర్యాదు చేయాలి. వినియోగదారుడి హక్కులు, ప్రయోజనాల గురించి తెలియజెప్పేందుకు మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం కూడా నిర్వహిస్తున్నారు.


వినియోగదారుల కమిషన్ల ఫోన్ నంబర్లు

- టోల్ ఫ్రీ నంబర్: 18004250033
- జాతీయ వినియోగదారుల కమిషన్, న్యూఢిల్లీ: ఫోన్ 011-24608724.
- తెలంగాణ రాష్ట్ర కమిషన్, హైదరాబాద్, ఫోన్: 040-23394399
- హైదరాబాద్ జిల్లా కమిషన్ ఎంజే రోడ్, నాంపల్లి, ఫోన్: 040-24733368, 040-24747733, 040-24746001
- రంగారెడ్డి జిల్లా కమిషన్, ఎన్టీఆర్ నగర్, ఎల్బీనగర్, ఫోన్: 040-24031275

కేసుల పరిష్కారం ఇలా..

సంవత్సరం	నమోదైనకేసులు	పరిష్కారమైనవి
2023	1,076	1,274
2024	1,340	1,358
2025	113	159

సరైన రసీదు తీసుకోవాలి



వినియోగదారులు ఏదైనా వస్తువు కొన్నప్పుడు రసీదు తప్పక తీసుకోవాలి. ఆ వస్తువులో ఏదైనా లోపం ఉందని భావించినప్పుడు మీరు కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందడానికి ఆ రసీదు చాలా ఉపయోగపడుతుంది.

– రాంగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు, హైదరాబాద్ వినియోగదారుల ఫోరం-3

వెలవెలబోతున్న గ్రామసభలు

- కనిపించని ప్రజల భాగస్వామ్యం
- అవగాహన కల్పించని అధికారులు

దౌల్తాబాద్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యం లేక గ్రామాలు అభివృద్ధి చెందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే నామమాత్రంగా గ్రామసభలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నాయి. గ్రామపంచాయతీల అభివృద్ధిలో గ్రామసభల నిర్వహణ ఎంతో కీలకం. ఆయా శాఖల అధికారులతో పాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రజలు గ్రామసభల్లో పాల్గొని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం చర్చిస్తారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల వివరాల నమోదు గ్రామసభల ద్వారా నిర్వహిస్తారు. ప్రభుత్వాలు చేపట్టే కొత్త పథకాలు, పనులపై ప్రజల అభిప్రాయాలు ఈ సభల ద్వారానే తెలుస్తాయి. ఇంత ప్రాధాన్యం ఉన్న గ్రామసభలు జిల్లాలో నామమాత్రంగానే కొనసాగడం విశేషం.



దౌల్తాబాద్‌లో గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ (ఫైల్)

గ్రామసభల నిర్వహణ ఇలా...

గ్రామపంచాయతీల్లో ప్రతి రెండు నెలలకోసారి గ్రామసభలను సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించాలి. అయితే ప్రస్తుతం సర్పంచ్‌లు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులే గ్రామసభలు నిర్వహిస్తున్నారు. పంచాయతీతో పాటు అనుబంధ గ్రామాల్లో సభలు నిర్వహించే తేదీని సంబంధిత పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో దండోరా వేయించాలి. నిబంధనల ప్రకారం విధిగా 17శాఖల అధికారులు జనాభాలో సుమారు 20శాతం మంది ప్రజలు గ్రామసభకు హాజరు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. కనీసం 50మందితో గ్రామసభను ఏర్పాటు చేసుకోవాలని నిబంధనలు ఉన్నా తూతూమంత్రంగా గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీ ఆదాయ, వ్యయాలపైన కార్యదర్శులు నివేదికలు చదివి వినిపించాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆసక్తి చూపని గ్రామస్తులు

జిల్లాలోని చాలా గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలకు కనీసం పది నుంచి ఇరవై మంది కూడా రావడంలేదు. ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏలు, వైద్యసిబ్బంది మాత్రమే వస్తున్నారు. పంచాయతీల అభివృద్ధి విషయంలో ప్రజలకు నాయకులకు మధ్య అంతగా సమాచారం ఉండడంలేదు. గ్రామసభల్లో చర్చిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపితే గ్రామసభలకు ఆదరణ పెరిగే అవకాశం ఉంది. సమస్యలు పేరుకుపోవడంతో సభలకు ఆదరణ తగ్గుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యం పెరగాలి



గ్రామసభల్లో ప్రజల భాగస్వామ్యం మరింతగా పెరగాలి. సభల నిర్వహణపై కార్యదర్శులతో గ్రామాల్లో దండోరా వేయిస్తున్నాం. సమాచారం తెలుసుకుని ప్రజలు స్వచ్ఛందంగా సభకు రావాలి. తద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వీలుంటుంది.

– శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్